ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు - గరిష్ఠం : 38.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 31 మార్చి 2025

విశ్వావసుకు సుస్వాగతం

జిల్లావ్యాప్తంగా ఉగాది సంబరాలు



కలెక్టరేట్‌లో ఉగాది వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ టీఎస్ చేతన్



అలరించిన నృత్యం

పుట్టపర్తిటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరానికి సుస్వాగతం పలికారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెలుగుదనం ఉట్టిపడేలా పంచాంగ పఠనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జిల్లాను ప్రగతి పథంలో నిలుపుదాం..

నూతన సంవత్సరంలో జిల్లాను ప్రగతి పథంలో నిలపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ఆదివారం ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పంచాంగ శ్రవణం, కవిసమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యప్రదర్శన కార్యక్రమాలు అలరించాయి. కలెక్టర్ మాట్లాడుతూ.. విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం దేవదాయశాఖ ఆధ్వర్యంలో 62 సంవత్సరాలు దాటిన హిందూపురం దక్షిణామూర్తి దేవస్థానం అర్చకుడు సత్యనారాయణశాస్త్రి, కుణుగూ అంజనేయస్వామి అర్చకుడు శాంతేశ్వరప్రసాద్, బుక్కపట్నం వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మను కలెక్టర్ సన్మానించి, ఒక్కొక్కరికి 10,116 నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ విజయసారథి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పర్యాటకశాఖ మేనేజర్ ప్రతాపరెడ్డి, ఏవో వెంకటనారాయణ, జిల్లా దేవదాయశాఖ అధికారి నరసింహారాజు, డీఎస్పీ విజయకుమార్, వేదపండితులు వానవోలు నాగరాజశాస్త్రి, కవులు తదితరులు పాల్గొన్నారు.




అలంకరణలో మహాసమాధి



ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను ఆవిష్కరిస్తున్న రత్నాకర్, చక్రవర్తి

సాయి సన్నిధిలో ఘనంగా ఉగాది ఉత్సవాలు

పుట్టపర్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతు మందిరంలో ఆదివారం ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మొదట సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సమాధి సన్నిధిలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. డాక్టర్ వేదాంతం రాజగోపాలచక్రవర్తి పంచాంగ పఠనం చేశారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఫలితాలు, రాశిఫలాలు గురించి పండితులు వివరించారు. వేద పఠనం, అతిరుద్ర యజ్ఞం ఆసియా బుక్‌ఆఫ్ రికార్డ్సులో స్థానం దక్కించుకుందని ప్రకటించారు. దీనిని సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్‌ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సత్యసాయి గ్లోబల్ చైర్మన్ చక్రవర్తి ఆవిష్కరించారు. సాయంత్రం ప్రముఖ సంగీత గాయకులు గుడిపాటి శ్రీలలిత బృందం సంగీత గాన కచేరి నిర్వహించారు. ఉగాది సందర్భంగా వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పంచాంగ పఠనం చేస్తున్న వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి

నేడు ఈద్-ఉల్-ఫితర్

ఈద్గాలు, మసీదుల్లో ఏర్పాట్లు పూర్తి

పుట్టపర్తిరూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో 30 రోజులపాటు ఉపవాసాలు ఉంటూ దైవ చింతనతో గడిపారు. రంజాన్ నెల ముగింపుగా ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని జరుపుకుంటారు. ఉదయాన్నే మసీదుకు చేరుకుని ముస్లింలు వజూ నిర్వహిస్తారు. అనంతరం ఊరేగింపుగా ఈద్గా మైదానం చేరుకుంటారు. అక్కడ సామూహిక ప్రార్థనలు చేస్తారు. అనంతరం మతగురువు కుద్బాప్రసంగం, అనంతరం అల్లాను దువా చేస్తారు. పరస్పరం ఆలింగనం చేసుకుని, ఈద్ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. రంజాన్ నేపథ్యంలో జిల్లాలోని మసీదులు ముస్తాబయ్యాయి. ఈద్గా మైదానాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

నీటి కోసం పిచ్చుక పాట్లు



కొళాయి వద్ద గుక్కెడు నీటి కోసం పిచ్చుక ప్రయత్నం


కొత్తచెరువు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండే ఎండకు జీవులన్నీ తాపంతో అల్లాడిపోతున్నాయి. చల్లదనం కోసం పరితపిస్తున్నాయి. ఇక పశు పక్షాదులైతే గుక్కెడు నీటి కోసం నానా పాట్లు పడుతున్నాయి. అడవులు, జలరాశులు తరిగిపోవడంతో గొంతు తడుపుకోవడానికి జనారణ్యంలోకి వస్తున్నాయి. ఇలాంటిదే ఆదివారం ఓ పిచ్చుక గొంతు తడుపుకోవడానికి నీటి చుక్కలు కారే కొళాయి వద్ద చక్కర్లు కొడుతూ కనిపించింది.

జాతీయ హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు



క్రీడాకారులు ప్రశాంత్, లోకేశ్

ధర్మవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): జాతీయ సీనియర్ హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ప్రశాంత్, లోకేశ్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాశ్ ఆదివారం తెలిపారు. ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ పోటీల్లో జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచిందన్నారు. టోర్నీలో ప్రతిభ కనబరచిన ప్రశాంత్, లోకేశ్ రాష్ట్రజట్టులో స్థానం సంపాదించారన్నారు. వీరు ఏప్రిల్ 4వ తేదీ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ నగరంలో నిర్వహించే పురుషుల జాతీయ సీనియర్ హాకీ పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సత్కరించారు. కార్యక్రమంలో బంధనాథం సూర్యప్రకాశ్‌పాటు హాకీ అసోషియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు ఊంజల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

నయనమనోహరం

కదిరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఊంజలసేవ ఆదివారం నయన మనోహరంగా సాగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలోని రంగమండపంలో భూదేవి, శ్రీదేవి సమేతుడైన శ్రీవారికి ఊంజల సేవ నిర్వహించారు. శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు నిత్యాది పూజలు, కైంకర్యాలు చేశారు. పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలపై ఆశీనులు గావించారు. ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం అర్చకులు పంచాంగ పఠనం చేశారు.



మాట్లాడుతున్న ఐశ్వర్య రాజేష్, బుల్లిరాజు

పురంలో బుల్లిరాజు, భాగ్యం సందడి

హిందూపురంలో ఆదివారం సినీతారలు తలుక్కుమన్నారు. ఇటీవల ఓ సినిమాలో బుల్లిరాజు క్యారెక్టర్‌తో విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకున్న బాల నటుడు రేవంత్, అదే చిత్రంలో భాగ్యం పాత్రతో క్రేజ్ తెచ్చుకున్న నటి ఐశ్వర్య రాజేశ్ ఓ కార్యక్రమానికి హాజరై, సందడి చేశారు. అభిమానులకు అభివాదం చేస్తూ.. సెల్ఫీలు ఇస్తూ ఉత్సాహం నింపారు. అవకాశం వస్తే బాలయ్య బాబుతో నటించాలని ఉందని ఐశ్వర్య రాజేశ్ తెలిపారు.

-హిందూపురం అర్బన్(ఆంధ్రజ్యోతి)

2 నుంచి స్లాట్ బుకింగ్

బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులోకి రానున్న సేవలు

బుక్కపట్నం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అందుబాటులోకి తేనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ విధానంతో ప్రజలకు పడిగాపులు కాయాల్సిన అవసరం ఉండదన్నారు. రోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రజలు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. నిర్ణీత సమయంలో వచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగించుకుని, వెళ్లవచ్చన్నారు. త్వరలో జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేస్తామని ఆమె వివరించారు.

పింఛన్ సొమ్ము రెడీ

ధర్మవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బ్యాంకులకు వరుస సెలవులు వచ్చినప్పటికీ ఏప్రిల్ ఒకటో తేదీనే పింఛన్లను పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. సచివాలయ సిబ్బంది రెండు రోజుల ముందుగానే సొమ్మును డ్రా చేశారు. జిల్లాలోని 544 సచివాలయాల సిబ్బంది శనివారమే బ్యాంకుల నుంచి డబ్బులను డ్రా చేసుకుని ఒకటో తేదీన పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచుకున్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జిల్లాలో మొత్తం 2,65,277 మంది పొందుతున్నారు.

పరిటాల సునీతపై పాట

వెంకటాపురంలో సీడీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే, పరిటాల శ్రీరామ్



సీడీని ఆవిష్కరిస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

రామగిరి, మార్చి30(ఆంధ్రజ్యోతి): రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత జీవిత పోరాటాలు, రాజకీయ జీవితంపై మరో పాటను రూపొందించారు. ఈ సీడీని వెంకటాపురంలో ఆదివారం ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని జీడిమెట్లకు చెందిన తాతినేని సాయిచరణ్(బాబి)ఈ పాటకు రూపకల్పన చేశారు. మొత్తం తెలంగాణ మాండలికంలో ఉన్న ఈ పాటను ప్రముఖ గాయకుడు నల్గొండ గద్దర్(నరసన్న)తో పాడించారు. పోరాటాల పొద్దువునీవే అమ్మా సునీతమ్మ...పేద బిడ్డల తల్లివే సునీతమ్మ అంటూ ఈ పాట మొదలవుతుంది. ఈ పాటలో ఎమ్మెల్యే నిజజీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, పార్టీ కోసం చేసిన పోరాటాలు, ఆమె మంత్రిగా, ఎమ్మెల్యే ఉన్నప్పుడు అందించిన సేవలు తదితర అంశాలను పొందుపరిచారు. ఈ సందర్భంగా సాయిచరణ్ మాట్లాడుతూ... తాను మొదటినుంచి పరిటాల అభిమానిగా ఉన్నానని, ఆ కుటుంబంపై ప్రేమతోనే ఈ పాటను తయారు చేశానన్నారు.

రేపట్నుంచి సదరం స్లాట్స్

అనంతపురం టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సంబంధించి వికలాంగత్వం, దీర్ఘకాలిక రోగులకు వ్యాధి నిర్ధారణ సర్టిఫికెట్లకు సదరం స్లాట్స్ మంగళవారం ఓపెన్ కానున్నాయి. నకిలీ దివ్యాంగుల ఏరివేతే లక్ష్యంగా ఇటీవ రాష్ట్ర ప్రభుత్వం వెరిఫికేషన్ చేయిస్తోంది. ఈఏడాది జనవరి నుంచి ఈ రీవెరిఫికేషన్ పక్రియను కొనసాగిస్తు న్నారు. ఇంకా ఈప్రక్రియ జరుగుతున్నా అనేక మంది దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు పింఛన్ల కోసం సదరం సర్టిఫికెట్లను పొందడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ ఒకటి నుంచి సదరం స్లాట్స్ తిరిగి ప్రారంభించాలని రాష్ట్ర వైద్యశాఖ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే అధికారికంగా సంబంధిత వైద్యశాఖ కమిషనర్ ప్రకటించారని డీసీహెచ్‌ఎస్ డాక్టరు పాల్ రవికుమార్ తెలిపారు. అయితే గతంలో ఉన్నన్ని సదరం ఆస్పత్రులు ఉండకపోవచ్చని, వారానికి రెండురోజులు మాత్రమే సదరం ఉండే అవకాశం ఉందన్నారు.

అయ్యో.. అమ్మా.. నాన్నా..!



రోదిస్తున్న కృష్ణాచారి తల్లి, కుటుంబ సభ్యులు



ఇంట్లో విగత జీవులుగా పడి ఉన్న కృష్ణాచారి, భార్య, కుమారులు

మడకశిరటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో శనివారం పట్టణంలోని గాంధీ బజార్‌కు చెందిన బంగారం వ్యాపారి కృష్ణాచారి (55), సరళ (39) దంపతులు.. తమ కుమారులు సంతోష్ (15), భువనేశ్ (13)కు విషమిచ్చి, అనంతరం వారూ తాగి ఆత్మహత్య చేసుకున్నారు. నలుగురూ చనిపోయారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఉగాది పండుగ రోజునే ఇంటిలోనూ వారందరూ మరణించడంతో బంధువులు విషాదంలో మునిగిపోయారు. కృష్ణాచారి తల్లి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న ఎస్పీ రత్న ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో శోధించినా ఎలాంటి ఆధారాలూ లభించలేదు. కృష్ణాచారి జేబులో సైనైడ్ దొరికింది. దానిని తాగి, ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. కొత్త ఇంటిని నిర్మించుకొని, కృష్ణాచారి వేరుగా ఉంటున్నట్లు కుటుంబీకులు తెలిపారు. కొంత భూమి కూడా ఉందని బంధువులు తెలిపారు.

కష్టాలు తెలియకుండా పెంచుతున్నారు..
కన్నీరు కార్చకుండా చూసుకుంటున్నారు..
మీ ఒడిలో సేదతీరాం..
మీ భుజాలనెక్కి ఆడుకున్నాం..
మా ప్రపంచమే మీరు..

మేం అడిగినవన్నీ ఇస్తున్నారు..
మా అల్లరిని ఆనందంగా భరిస్తున్నారు..
మేమే లోకం అనుకున్నారు..
మా కోసమే బతుకుతున్నారు..
మీ పంచ ప్రాణాలు మేము..

ఉగాది వచ్చేసింది..
అమ్మానాన్నతో ఆనందంగా గడపాలని..
పండుగ చేసుకోవాలని వచ్చాం..
మీరు నీళ్లిస్తే తాగాం..

మమ్ములను ఆడించి లాలించిన చేతులే..
విషం ఇస్తాయనుకోలేదు..
మీ కళ్లముందే మేం తల్లడిల్లుతుంటే..
మీ గుండెలు పగిలి.. ఎలా
రోదించి ఉంటారో తెలుసు..
ఎన్నో కష్టాలు పడి.. మమ్ములను పెంచింది..
ఇందుకోసమేనా..?
మమ్ములను చంపి..
మీరు ఆత్మహత్య చేసుకునేందుకేనా..?

ఎంత పెద్ద కష్టమైనా.. ఎదురించి..
పోరాడి ఉండుంటే...
కచ్చితంగా గెలిచేవారు..
అందరం ఆనందంగా ఉండేవారం..
ఒక్కసారి ఆలోచించాల్సింది..
అమ్మానాన్నా..

ప్రభాకర్ చౌదరికి కళారత్న అవార్డు



సీఎం చంద్రబాబు నుంచి కళారత్న అవార్డు అందుకుంటున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరికి సామాజిక సేవల విభాగంలో కళారత్న (హంస) అవార్డు ప్రదానం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో అవే సంస్థ వ్యవస్థాపకులు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరికి సీఎం చంద్రబాబు కళారత్న అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పీ-4 కార్యక్రమం నిర్వహణ కోసం వైకుంఠం ప్రభాకర్ చౌదరి తన వంతుగా రూ.లక్షను సీఎం సహాయ నిధికి అందజేశారు. అవార్డు అందుకున్న ప్రభాకర్ చౌదరికి పలువురు టీడీపీ నాయకులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

చరిత్ర పరిశోధకుడు మైనాస్వామికి..



అవార్డు అందుకుంటున్న మైనాస్వామి

గోరంట్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరావులపల్లి గ్రామానికి చెందిన చరిత్ర పరిశోధకుడు మైనాస్వామికి ఉగాది పురస్కారం లభించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆదివారం ఆయన పురస్కారం అందుకున్నారు. చారిత్రక పరిశోధనలు, శిలా శాసనాలు, పురాతన ఆలయాల విశిష్టతను వెలికి తీయడంలోనూ, పత్రిక ద్వారా బహ్య ప్రపంచానికి తెలియజేయడంలో ఆయన విశిష్టసేవలు అందించారు. అందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలకు ఎంపిక చేసి, అవార్డు అందజేసింది. విజయవాడ వద్ద గల తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మైనాస్వామికి సత్కారం జరిగింది.

శవమై తేలిన చేనేత కార్మికుడు

సోమందేపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక సోమందేపల్లి చెరువు సమీపంలో హంద్రీనీవా కాలువలో శనివారం సాయంత్రం గల్లంతైన చేనేత కార్మికుడు కృష్ణారెడ్డి(44) ఆదివారం శవమై తేలాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది సంఘటనా స్థలానికి శనివారం వెళ్లి గాలించారు. ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం మరోమారు గాలించారు. నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించి, బయటకు తీయించారు. పోలీసుల తెలిపిన మేరకు కృష్ణారెడ్డి తరచూ ఈతకు వెళ్లేవాడు. ఈ క్రమంలో శనివారం ద్విచక్రవాహనంపై హంద్రీనీవా కాలువ వద్దకు వెళ్లి అందులో దూకాడు. కాలువలో ఉన్న ముళ్లకంపలు తగులుకుని ప్రమాదవశాత్తు మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య కళావతి, కుమారుడు యుగంధర్‌రెడ్డి, కుమార్తె ఇందు ఉన్నారు.

టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ

వైసీపీ కార్యకర్త మృతి... కుమారుడికి తీవ్రగాయాలు



గ్రామంలో పర్యటిస్తున్న ఎస్పీ రత్న



లింగమయ్య మృతదేహం

రామగిరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లిలో ఆదివారం తలెత్తిన ఘర్షణలో వైసీపీ కార్యకర్త లింగమయ్య (60) మృతిచెందగా.. అతడి కుమారుడు శ్రీనివాసులు గాయపడ్డాడు. లింగమయ్య భార్య రామాంజినమ్మ.. పోలీసులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లింగమయ్య పెద్ద కుమారుడు మనోహర్ మూడు రోజుల క్రితం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఆదర్శ్‌తో చిన్నపాటి గొడవ పడ్డాడు. ఆదివారం ఉదయం గ్రామంలో మరోసారి వారు గొడవపడ్డారు. విషయాన్ని మనోహర్.. తండ్రి లింగమయ్యకు తెలిపాడు. దీంతో లింగమయ్య.. ఆదర్శ్ అతడి కుటుంబీకుల పట్ల నానా దుర్భాషలాడాడు. కులం పేరుతో దూషించాడు. విషయాన్ని పలువురు.. ఆదర్శ్‌కు తెలిపారు. ఆగ్రహానికి లోనైన అతడు.. తన బంధువైన నాయుడు, మరికొందరితో కలిసి లింగమయ్య ఇంటి వద్దకెళ్లి, గొడవపడ్డాడు. కర్రలతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. అడ్డువచ్చిన లింగమయ్య చిన్న కుమారుడు శ్రీనివాసులుపై కూడా దాడి చేశారు. వారికి తీవ్రగాయాలవడంతో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి లింగమయ్యను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ రత్న గ్రామానికి చేరుకుని, పరిశీలించారు. లింగమయ్య భార్య రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్.. ఆదర్శ్, నాయుడుపై కేసు నమోదు చేశారు.

వ్యక్తిగత గొడవలను పార్టీలకు ఆపాదించవద్దు

పాపిరెడ్డిపల్లి ఘటనపై ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్


ధర్మవరం(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లిలో ఆదివారం జరిగిన ఘటనకు రాజకీయాలతో సంబంధంలేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. గ్రామంలో ఉగాది పండుగ నేపథ్యంలో కొందరు తమ పెద్దల సమాధులు, దేవాలయాల వద్ద పూజలు చేసి వస్తుండగా చిన్న ఘటనతో గొడవ మొదలైందన్నారు. క్షణికావేశంలో పరస్పరం దాడులు చేసుకున్నారన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి మృతిచెందడం చాలా బాధాకరమన్నారు. గ్రామాల్లో వ్యక్తిగత గొడవలతో జరిగిన ఘటనలను కూడా వైసీపీ నాయకులు.. పార్టీలకు, రాజకీయాలకు, కులాలకు ఆపాదిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. పాపిరెడ్డిపల్లిలో ఎలాంటి ఫ్యాక్షన్ గొడవలు లేవని వారు తెలిపారు. ఒక వ్యక్తి మరణాన్ని రాజకీయంగా వాడుకునేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారనీ, ఇలాంటి వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. పాపిరెడ్డిపల్లి ఘటన పూర్తిగా వ్యక్తిగత కారణాలతోనేనని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఫ్యాక్షన్, రాజకీయ గొడవలను తెలుగుదేశం పార్టీ మరీ ముఖ్యంగా పరిటాల కుటుంబం ప్రోత్సహించదని పరిటాల సునీత, పరిటాలశ్రీరామ్ స్పష్టం చేశారు.

రోడ్డుపై మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తచెరువు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లకుంట క్రాస్ రోడ్డు డివైడర్‌పై గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. ఆ మృతదేహం తమ పరిధిలోకి రాదని పుట్టపర్తి పోలీసులు, తమ పరిధిలోకి రాదని కొత్తచెరువు పోలీసులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ రోడ్డుపైనే వదిలేశారు. ఈ అమానుష ఘటన చూసి చుట్టు పక్కల వాళ్లు అయ్యో ఇంత దారుణమా ఒక మనిషి చనిపోతే పోలీసులకు కరుణలేదాఅని చర్చించుకుంటున్నారు. చివరికి ఉన్నతాధికారుల జోక్యంతో కొత్తచెరువు పోలీసులు పెద్దల సమక్షంలో పంచనామా చేసి అంత్యక్రియలు నిర్వహించారు.





ప్రభుత్వ ఆఫీసులో ప్రైవేటోళ్ల రాజ్యం..!

అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల హవా

ఒకరు పద్దులు రాస్తే.. మరొకరు వసూలు చేస్తారు..
ప్రతి వారం రూ.40వేల నుంచి రూ.50వేలుపైనే ఆదాయం
డీఆర్ ఆదేశాలూ డోంట్ కేర్

అనంతపురం క్రైం, మార్చి30(ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల పెత్తనం ఎక్కువగా ఉంటుంది. ఏదో పని మీద వచ్చి ఉద్యోగుల మాదిరిగా సెటిలైపోయారు. ఉద్యోగులకూతే బదిలీ ఉంటుంది... వీరికి ఆ ఇబ్బంది కూడా ఉండదు. ఏళ్లపాటు కొనసాగుతూ.. కార్యాలయాన్నే తమ గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల రాజ్యం నడుస్తోంది. ఒకరు సీరియస్‌గా కంప్యూటర్ చూస్తూ... డాక్యుమెంట్ల వివరాలు చెక్ చేస్తుంటాడు. అతడు పెద్ద ఆఫీసరేమోనని ఆఫీసుకు వచ్చే వారు సార్ అని పిలుస్తుంటారు. అతనో ప్రైవేటు వ్యక్తి. మరొకరు టిఫిన్లు, భోజనాలు ఇతరత్రా అవసరమైన వాటిని తెచ్చిస్తాడు. అతనూ ప్రైవేటు వ్యక్తే. చివరికి కారు డ్రైవర్‌ను కూడా పెట్టుకుంటారు. ఇదంతా కార్యాలయానికి వచ్చే ఆదాయం నుంచే చెల్లిస్తారట. రోజువారీగానీ, వారానికోసారిగానీ డబ్బు పంచేసుకుంటారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఆ లెక్క కూడా ఒక్కొక్కరికి ఒక్కోలా ఉంటుంది. ఇక్కడ ఓ సీనియర్ అసిస్టెంట్, ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు అన్నింటా తామై వ్యవహారం నడుపుతున్నారు.



చక్రం తిప్పుతున్న సీనియర్ అసిస్టెంట్

అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ సీనియర్ అసిస్టెంట్ చక్రం తిప్పుతున్నారు. ఆదాయమే పరమావధిగా ఆయన పనిచేస్తుంటారన్నది బహిరంగ రహస్యమే. గతంలో రాంనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే సమయంలో రిజిస్ట్రేషన్ల విషయంలో ఆయన నడిపిన వ్యవహారం అంతా ఇంతా కాదు. ఆ సమయంలో బాగానే ఆర్జించిన ఈయన ఇక్కడా అదే వ్యవహారం నడుపుతున్నారు. వచ్చిన కొత్తలో అసైన్, చుక్కల భూమి, భాగపరిష్కారాలు ఇలా ఎలాంటి సబ్జెక్టయినా రిజిస్ట్రేషన్ చేస్తూ సొమ్ము చేసుకున్నారు. ఓ సందర్భంలో సబ్‌రిజిస్ట్రార్ లాగిన్‌లోనే సమీప భూములకు సంబంధించి రెండు డాక్యుమెంట్లు చేసి వివాదానికి కారణమయ్యారు. మరి ఆ ఇద్దరి మధ్య ఏం నడిచిందో కానీ, అది సద్దుమణిగినట్లు తెలిసింది. ఆ రెండింటి నుంచి రూ.లకారాల్లోనే లబ్ధి పొందినట్లు సమాచారం. సమీపంలోని ఓ మండల పరిధిలో ఎకరం వివాదాస్పద భూమికి ఎనీవేర్ కింద రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. అక్కడ డాక్యుమెంట్ చేయడానికి అనంతపురం రూరల్‌లో ఓకే కొట్టడానికి రూ.5.50 లక్షలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. సబ్‌రిజిస్ట్రార్ సెలవులో వెళ్లినపుడు, శనివారం వస్తే ఆయనకు పండగే. తాజాగా పైఅధికారులకు అసలు విషయం తెలిసి కొంతవరకు ఆయన పవర్ కట్ చేసినట్లు సమాచారం.

ఒకరు పద్దులు.. మరొకరు వసూలు..

అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల హవా నడుస్తోంది. ఓ ముగ్గురు వ్యక్తులు కీలకంగా వ్యవహారం నడుపుతున్నారు. అందులో ఇద్దరు వ్యక్తులు... రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం 2007లో ప్రారంభమైనప్పటి నుంచి ఉన్నారు. ప్రతి రిజిస్ట్రేషన్‌కు డాక్యుమెంట్ రైటర్లు మర్యాదపూర్వకమైన ముడుపులు అందజేస్తారు. రిజిస్ట్రేషన్లు, మార్ట్‌గేజ్‌లతోపాటు వివాదముంటే వాటికి మరింత జోడించి ఇస్తారు. ఇలా రోజూ డాక్యుమెంట్ల వారీగా ఎవరెవరివో ఓ ప్రైవేటు వ్యక్తి రాసుకుంటారు. మరో వ్యక్తి రోజు వారీగానీ, సెలవు రోజులో(వారాంతం)లోగానీ ఆ డబ్బు వసూలు చేసుకొస్తాడు. ఇలా ప్రతి వారం అందరికీ పంపకాలయ్యాక రూ.40వేల నుంచి రూ.50వేల వరకు జేబులోకి వేసుకుంటారని సమాచారం. ఆది నుంచీ ఉండటంతో అధికారులు సైతం ఏది అసైన్, ఏది రిజిస్ట్రేషన్ చేయవచ్చు, ఏ భూమి విషయంలో సమస్య ఉందనేవిషయంలో ఈ ఇద్దరి సలహాలు తీసుకుంటారట.

ఆమె డామినేషన్..

ఆ ప్రైవేటు ఉద్యోగుల్లో ఒకామె మరోలా డామినేషన్ చేస్తోందట. ఆ ఆఫీస్‌కు ప్రత్యేకమట. మొన్నటివరకు రికార్డులు, డాక్యుమెంట్లు జత చేయడం వంటి పనులు చేస్తున్న ఆ ప్రైవేటు వ్యక్తిని ఏకంగా ఆఫీ్‌సలో డాక్యుమెంట్లు జరిగే చాంబర్‌లోకి ప్రవేశపెట్టారు. ఆమెకో సిస్టమ్ కూడా ఇచ్చారట. ఈ మధ్యనే అటెండర్‌తో ఈ ప్రైవేటు వ్యక్తి గొడవకు దిగి... 'మేము ఉండకూడదని చెప్పడానికి నువ్వెవరు?' అంటూ పెద్ద గొడవే చేసిందట.

డీఆర్ అంటే డోంట్ కేర్...

రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఐదుగురు ప్రైవేటు వ్యక్తులున్నారు. ఆఫీసుల్లో ప్రైవేటు వ్యక్తులు పని చేయవద్దని జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) ఇటీవల స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీంతో వారు కొన్ని రోజులు మాత్రమే ఆఫీస్‌కు దూరంగా ఉన్నారు. మళ్లీ ఎంచక్కా రంగంలోకి దిగారు. డీఆర్ అంటే డోంట్ కేర్ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. డీఆర్ నెలరోజుల క్రితం తన వివాహం సందర్భంగా సెలవుపై వెళ్లారు. రెండ్రోజుల క్రితం ఆయన విధుల్లో చేరారు. మరి ఏ మాత్రం చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు పాముకాటు

ఉరవకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని చిన్న హోతూరు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమోహన్ పాము కాటుతో అస్వస్థతకు గురయ్యాడు. తనిఖీల్లో భాగంగా ఆదివారం గ్రామ సమీపంలో పనులు పరిశీలించి ఇంటికి వస్తుండగా దారిలో బైకు చక్రాల కిందకు పాము దూరింది. ఆందోళనతో వాహనాన్ని అదుపు చేయలేక కిందపడ్డాడు. ఈక్రమంలో పాము కాటు వేసింది. స్థానికులు అతడిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

న్యూస్ బాక్స్

ఘనంగా ఉగాది ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో జోడుగుళ్ల గంగమ్మ

తనకల్లు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకించి మార్పూడివాండ్లపల్లి సమీపంలో ఉన్న జోడుగుళ్ల గంగమ్మ, పరాకువాండ్లపల్లి వద్ద ఉన్న కట్టకింద గంగమ్మ, కొక్కంటి క్రాస్‌లో ఉన్న మారెమ్మ ఆలయాలు మహిళలతో నిండిపోయాయి. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఊరేగింపులు నిర్వహించారు. జోడు గుళ్ల గంగమ్మ ఆలయం వద్ద మూడు రోజుల పాటు తిరునాల నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని వివిధ ఆలయాల్లో ప్ర త్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పచ్చడి, పంచాంగ శ్రవణం విన్నారు.



జ్యోతులను మోస్తున్న మహిళలు

● తనకల్లు: మండలపరిధిలోని ఒడ్డుమరువపల్లిలో ఆదివారం ఉగాది పండుగ సందర్భంగా గ్రామస్థులు జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహించారు. గ్రామదేవతలైన చౌడమ్మ, సొప్పలమ్మ, గంగమ్మ, రామస్వామి, లక్ష్మీనరసింహస్వామి గ్రామం చుట్టు ఉన్న గొడ్డెమ్మ దేవతలకు జ్యోతులను సమర్పించారు. ప్రతి గుడి వద్దకు వెళ్లి భక్తి శ్రద్ధలతో మహిళలు జ్యోతులను సమర్పించారు. కార్యక్రమంలో గ్రామంలోని వివిధ కులవృత్తుల వారు పాల్గొన్నారు.

● కొత్తచెరువు: మండలంలో ఉగాది పండుగను ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధల తో చేసుకున్నారు. రేణుకాయల్లమ్మ, పెద్దమ్మతల్లి, ఆంజనేయస్వామి, శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, రేణుకాయల్ల మ్మ విగ్రహాలకు వివిధ రకాల పూలు, నిమ్మకాయలు, వేపాకులతో పాటు పట్టు వస్త్రాలు ధరించి ప్రత్యేక పూజలు చేశారు.



అలంకరణలో పెద్దమ్మదేవత



ఓబుళదేవరచెరువులో గ్రామదేవత ఊరేగింపు

● ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలో ఉగాది పండుగ సందర్భంగా పిట్టా వంశస్థులు మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, పిట్టా ప్రభాకర్‌రెడ్డి, పిట్టా రాజారెడ్డి అధ్వర్యంలో ఓబులమ్మ, ఓబులప్ప ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. పాత రామాయాలయం నుంచి ప్రధాన వీధుల గూండా గ్రామదేవతను మేళతాళాతో ఊరేగించారు. భక్తులు గ్రామదేవత ఓబులమ్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పిట్టా శివశంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● పుట్టపర్తి: శిల్పారామంలో ఉగాది ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సంగీత సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలను తిలకించడానికి వందలాది మంది తరలివచ్చారు. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తాడిపత్రి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పొలిమేర పెద్దమ్మ, సుంకులమ్మపాలెంలోని సుంకులమ్మ, కృష్ణాపురంరోడ్డులోని గంగమ్మ , నందలపాడు పెద్దమ్మ ఆలయాల్లో ఉగాది సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయమే పూజారులు ఆలయంలోని అమ్మవార్ల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సుంకులమ్మ పాలెంలో స్థానికులు మంగళవాయిద్యాలతో, పందేరపు బండ్లతో పెద్దఎత్తున స్థానిక పెన్నానదికి వెళ్లి జలధిని నిర్వహించారు.

కసాపురంలో గరుడ వాహనోత్సవం

గుంతకల్లు, మార్చి30(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని కసాపురం దేవస్థానంలో ఆదివారం రాత్రి గరుడ వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. నెట్టికంటి మూల విరాట్టుకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీసీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి, గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.



గరుడ వాహనంపై సీతారామలక్ష్మణులు

గిరిజన విద్యకు కేంద్రం చేయూత

● వసతి గృహానికి రూ.2.30 కోట్లు మంజూరు
● పెరగనున్న గిరిజనుల విద్యాప్రమాణాలు

తనకల్లు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గిరిజనుల్లో విద్యాప్రమాణాలు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోంది. అందులో భాగంగా కేంద్రం ధాత్రి ఆబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ (డీఏ-జేయూజీఏ) కింద మండలానికి గిరిజన వసతి గృహం మంజూరు చేసింది. మండలంలోని దేవళం తండా వద్ద హాస్టల్ నిర్మాణం కోసం రెవెన్యూ శాఖ 64 సెంట్ల భూమిని కేటాయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం రూ.2.30 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. దీంతో దేవళంతండా సమీపంలో కేటాయించిన భూమిలో హాస్టల్ నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు. దేవళంతండాలో 1 నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వం పాఠశాలను నిర్వహిస్తోంది. ఈ పాఠశాలలో ప్రస్తుతం 54 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం దేవళంతండాకు రెండు కిలో మీటర్ల దూరంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాలను నిర్వహిస్తున్నారు. మరో గిరిజన హాస్టల్ కూడా మంజూరు కావడంలో ఈ ప్రాంత గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సదుపాయాలు లేక ప్రాథమిక స్థాయిలోనే గిరిజన విద్యార్థులు చదువులు మానేసున్నారు. ఈ నేపథ్యంలో హాస్టల్ వల్ల గిరిజనుల్లో విద్యాభివృద్ధి శాతం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామం వద్ద హాస్టల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, విద్యాశాఖాధికారులు చొరవ తీసుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు.





దేవళంతండాలోని ప్రభుత్వ పాఠశాల, హాస్టల్ నిర్మాణానికి భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ, విద్యాశాఖాధికారులు

విద్యాభివృద్ధికి అవకాశం



తమ గ్రామ సమీపంలో దేవళంతండా వద్ద కేంద్రం రూ.2.30 కోట్లతో హాస్టల్ నిర్మాణం కోసం చర్యలు చేపట్టడం ఆనందంగా ఉంది. గిరిజనుల విద్యాభివృద్ధి కోసం కేంద్రం చేపట్టిన కార్యక్రమాన్ని తమ గ్రామానికి తీసుకురావడంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కృషి చేశారు. విద్యాశాఖాధికారులు తమ గ్రామం వద్ద హాస్టల్ కోసం జిల్లా విద్యాశాఖకు ప్రతిపాదనలు పంపడంతోనే సాధ్యమైంది. హాస్టల్ నిర్మాణం చేపడితే ఎంతోమంది నిరుపేదలైన గిరిజన విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం ఉంటుంది.

-నాగభూషణనాయక్, గిరిజన నాయకుడు, నడిమితండా

గిరిజనుల సంఖ్య పెరగడంతోనే హాస్టల్




జిల్లాకు రెండు గిరిజన హాస్టళ్లు మంజూరైనట్లు విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందాయి. దీంతో మా ప్రాంతంలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారని హాస్టల్ మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. మా వద్ద ఉన్న అన్ని వివరాలను సకాలంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. దీంతో హాస్టల్ మంజూరైంది. జిల్లాకు రెండు కేంద్ర ప్రభుత్వ హాస్టళ్లు మంజూరుకాగా.. ఒకటి తనకల్లు మండలానికి రావడానికి మా వంతు కృషిచేశాం. రెవెన్యూ అధికారులు సకాలంలో భూమిని కేటాయించారు. ఈ హాస్టల్ ద్వారా గిరిజనుల్లో విద్యాభివృద్ధి మెరుగవుతుంది.

-లలితమ్మ, ఎంఈఓ, తనకల్లు

నిలువెత్తు నిర్లక్ష్యం..!

● కూలేందుకు సిద్ధంగా ట్యాంకు
● పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు

కదిరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పక్కన కనిపిస్తున్న వాటర్ ట్యాంకును దగ్గరగా చూస్తే ఒళ్లు జలదరిస్తుంది. ఏ క్షణంలో కూలుతుందో అన్నట్లుగా ఉంది. తలుపుల మండలం బట్రేపల్లి క్రాస్, రెక్కమానుకు మధ్య జాతీయ రహదారి పక్కనే ఉంది. ఈ ట్యాంకును సత్యసాయి వాటర్ ప్రాజెక్టు వారు గతంలో నిర్మించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఈ ట్యాంకు ఉన్న ప్రదేశం రోడ్డుకు పోతోంది. ఇప్పటికే అన్ని పైపులైన్లు తొలగించారు. అసలైన ట్యాంకును మాత్రం అలాగే వదిలేశారు. కదిరి-పులివెందుల మధ్య ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు, వేలాది ప్రయాణికులు వెళుతుంటారు. ఉడత ఊపులకే పెద్దపెద్ద విద్యుత్ లైను పడిపోయిన సంఘటన గతంలో జిల్లాలో చోటుచేకుంది. ఈ ట్యాంకు గాలికి పడిపోదని గ్యారెంటీ ఏమీ లేదు. అసలే వచ్చేది వర్షాకాలం. ఆ ప్రాంతం నీటికి ఏటవాలుగా ఉంది. కొండ ప్రాంతం నుంచి నీరు ఎక్కువగా వచ్చి మట్టికొట్టుకుపోతే కూలడం ఖాయం. అప్పుడు కారణాలు వెతుక్కునే కంటే ఎన్‌హెచ్ అధికారులు ముందే మేలుకుంటే ప్రమాదాన్ని నివారించిన వారవుతారు. ఈ ట్యాంకు వెంటనే తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



జాతీయ రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్యాంకు

ఘనంగా వేమన గొడుగుల మెరవణి



గొడుగుల మెరవణిలో నరసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి

గాండ్లపెంట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని కటారుపల్లి యోగి వేమన ఆలయంలో గొడుగుల మెరవణ నిర్వహించారు. ప్రతి ఏటా ఉగాదికి వేమన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వేమన సమాధిని ప్రత్యేకంగా అలంకరించి గొడుగులను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేమన సమాధికి కొబ్బరి కాయలు సమర్పించి పొర్లుదండాలతో మొక్కులు తీర్చుకున్నారు. వేడుకలకు కదిరి నరసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు నందవేమారెడ్డి, వేమారెడ్డి స్వాగతం పలికి సత్కరించారు.

పడమటి వీరన్నస్వామి ఉత్సవాలు ప్రారంభం








ఆత్మకూరులో పూజలందుకుంటున్న పడమటి వీరన్నస్వామి, పాల్గొన్న రైతులు, ముదిగుబ్బలో ఎద్దుల బండ్ల ప్రదర్శన

తాడిమర్రి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పశుపతినాథుడిగా పేరుగాంచిన పడమటి వీరన్నస్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆత్మకూరు గ్రామంలో ఉత్సవాలను ప్రారంభించారు. ప్రతిఏటా ఉగాది రోజున ఉత్సవాలు ప్రారంభించి శ్రీరామనవమి వరకు కొనసాగించడం ఆనవాయితీగా వస్తోంది. ఆయా రోజుల్లో జిల్లాలోని రైతులు పాడిపశువుల నుంచి తీసిన పాలను ఉపవాసంతో స్వామివారికి సమర్పించేందుకు వస్తారు.అలా చేస్తే పశువులకు ఎలాంటి వ్యాధులు రావని నమ్మకం. ఎద్దుల బండ్లను, ట్రాక్టర్లను అలంకరించుకుని వచ్చి స్వామివారి చుట్టు ప్రదక్షణ చేయించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

● ముదిగుబ్బ : మండల కేంద్రంలోని చెరువుకట్ట దగ్గర వెలసిన పడమటి వీరన్న స్వామికి ఉగాది పండుగ సందర్భంగా భక్తులు ఎడ్ల బండ్లు (పన్నారం బండ్లు)తో మొక్కులు తీర్చుకున్నారు. ఎడ్లబండ్లను సుందరంగా ముస్తాబు చేసి స్వామి వారికి మొక్కులు తీర్చుకుని గుడి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కన్నుల పండువగా తెప్పోత్సవం





తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, ప్రత్యేక అలంకరణలో ముసలమ్మ

బుక్కరాయసముద్రం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చిక్కవడాయార్ చెరువులో ఆదివారం నిర్వహించిన ముసలమ్మతల్లి తెప్పోత్సవం కన్నుల పండువగా సాగింది. ముసలమ్మతల్లి దేవాలయం కమిటీ ఛైర్‌పర్సన్ సుశీలమ్మ, సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ తెప్పోత్సవంను తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. చెరువులో దాదాపు మూడు కిలోమీటర్ల మేర జరిగిన ఈ తెప్పోత్సవం ఆద్యంతం ఆసక్తిగా సాగింది.

సీసీ రోడ్లు వేశారు.. కల్వర్టులు మరిచారు



సీసీరోడ్డు వేసి కల్వర్టు వేయని దృశ్యం

కొత్తచెరువు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేణుగోపాల్‌నగర్ వీధుల్లో ఇటీవల సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. సీసీ రోడ్ల నుంచి వీధుల్లోకి దాటుకునేందుకు డ్రైనేజీ కాలువలపై కల్వర్టులు వేయకుండా మరిచారు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రం ముందు డ్రైనేజీ కాలువపై కల్వర్టు వేయకపోవడంతో చిన్నారులు, వృద్ధులు అందులో పడిన గాయపడ్డ ఘటనలు చోటుచేసుకున్నాయి. పలుమార్లు పంచాయతీ అధికారులకు కల్వర్టులు ఏర్పాటు చేయాలని చెప్పినా పట్టించుకోలేదని ఆ కాలనీ వాసులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టులను ఏర్పాటు చేయాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

ముగ్గురిపై దాడి

ధర్మవరం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ వస్త్రదుకాణంలో దుస్తులు తీసుకునే విషయంలో గొడవ జరిగింది. బయటకు వచ్చిన తరువాత ఇద్దరు వ్యక్తులు కలిసి ముగ్గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు.. హరీశ్, ఇషాక్ వస్త్ర దుకాణంలో దుస్తులు తీసుకునే విషయంలో వాదించుకుంటుండగా హరీశ్ అనే వ్యక్తి కాటమయ్య, రాజేశ్, రాజను పిలిపించారు. వారు వచ్చి వారిద్దరికి సర్ది చెప్పి పంపించేశారు. ఆ తరువాత దుర్గానగర్ ఏటీఎం వద్ద కాటమయ్య, రాజేశ్, రాజు ఉండగా శనివారం రాత్రి ఇషాక్ అతడి అన్న అబ్దుల్ రెహమాన్‌వచ్చి కర్రలతో ఆ ముగ్గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వీరిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇషాక్, అబ్దుల్ రెహమాన్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

వారపుసంత వేలం

పుట్టపర్తి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని వారపు సంతను వేలం వేయగా రూ.13 లక్షలు ఆదాయం వచ్చినట్టు కమిషర్ ప్రహ్లాద పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహించగా పుట్టపర్తి వారపు సంతను రూ.8.25 లక్షలకు వెంకటరాముడు, ఎనుములపల్లి సంతను రూ.4.75లక్షలకు చిన్నన్న దక్కించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద యువకుల శ్రమదానం

ఓబుళదేవరచెరువు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఈద్గాను ఆదివారం యువకులు శుభ్రం చేశారు. యువకులు కలసి ఈద్గాకు పెయింటిగ్ వేశారు. పరిసర ప్రాంతాల్లో ముళ్ల పొదలు, ఇతర చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో యువకులు బాబ్‌జాన్, ఇర్షాద్, ఆరీఫ్, ఆసీఫ్, ఇమ్రాన్, వసీం, ఇస్మాయిల్, పండు తదితరులు పాల్గొన్నారు.



ఈద్గా వద్ద శ్రమదానం చేస్తున్న యువకులు

గాజుకుంటపల్లిలో ఇళ్లకు విద్యుత్ షాక్

● పలువురికి గాయాలు



గాజుకుంటపల్లిలో ఎర్త్ లేని ట్రాన్స్‌ఫార్మర్

ఓబులదేవరచెరువు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజుకుంటపల్లి పై ప్రాంతంలోని ఇళ్లకు ఆదివారం విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో విద్యుత్ షాక్ తగిలి పలువురికి గాయాలయ్యాయి. కాంతమ్మ, ఇద్దే రమణారెడ్డి, మరి కొంతమందికి విద్యుత్ షాక్ తగిలింది. ప్రధానంగా పై ప్రాంతంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్త్ లేకపోవడంతో గోడలకు, స్విచ్ బోర్డులకు, స్విచ్‌లకు, సెల్‌ఫోన్‌లకు విద్యుత్ షాక్ తగిలింది. కాంతమ్మ అనే వృద్ధురాలు రైస్‌కుక్కర్‌పై మూత పెడుతుండగా విద్యుత్ షాక్ తగిలింది. అమెకు కాళ్లు, చేతులు పనిచేయకుండా పోయాయని అమె భర్త గంగినాయుడు తెలిపారు. షాక్ గురైన అమెను ప్రైవేటు వాహనంలో ధర్మవరం తీసుకెళ్లినట్లు తెలిపారు. మరింత ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారి సురేంద్ర దృష్టికి తీసుకెళ్లగా విచారించి చర్యలు చేపడతామన్నారు.

ఉత్సాహంగా కవి సమ్మేళనం

అనంతపురం కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీకళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన కవిసమ్మేళనం ఉత్సాహంగా సాగింది. శ్రీకళాపీఠం ఛైర్‌పర్సన్ ఉమాదేవి చేతులమీదుగా కవులందరికీ ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కవులు హరి, మధురశ్రీ, గోసల, టీవీ రెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్



రథోత్సవంలో ఊరేగుతున్న చౌడేశ్వరీదేవి

వైభవంగా చౌడేశ్వరీదేవి రథోత్సవం

లేపాక్షి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌళసముద్రం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవి రథోత్సవాన్ని ఆదివారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పూలతో అలంకరించి రథోత్సవంలో అతిష్ఠింపచేసి పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. మేళతాళాల మధ్య అమ్మవారు పురవీధుల్లో ఊరేగారు.

దుర్గావీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో దుర్గాదేవి

లేపాక్షి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం ఉగాది పండుగను పురస్కరించుకుని అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. దాతలు అందజేసిన రంగు రంగుల పూలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



భక్తులు లేక బోసిపోయిన లేపాక్షి ఆలయం

తగ్గిన భక్తుల తాకిడి: ప్రతి శని, ఆదివారాల్లో లేపాక్షి ఆలయం భక్తుల తాకిడితో కిటకిటలాడుతుంది. అయితే ఈ ఆదివారం భానుడి ప్రతాపం అధికంగా ఉండటంతో భక్తుల సందడి తగ్గింది. ఉదయం 9 నుంచి ఎండలు అధికంగా ఉండటంతో భక్తులు రావడానికి జంకుతున్నారు. మార్చిలోనే అధిక ఎండలు ఉండటంతో మున్ముందు ఉష్ణోగ్రత ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఆంజనేయుడు

పెనుకొండ రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని ఆదివారం గ్రామాల్లో భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పెనుకొండ, రొద్దం మండలాల్లోని గ్రామాల్లో వెలసిన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తోరణాలు కట్టి, చిన్నారుల నుంచి పెద్దల వరకు నూతన వస్త్రాలు ధరించారు. ఆయా ఆలయాలకు వెళ్లి ప్రత్యేకపూజలు చేశారు.

జ్యోతుల మహోత్సవానికి తరలిరండి



అలంకరణలో చౌడేశ్వరీదేవి

సోమందేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తొగటవీరక్షత్రియ ఆరాధ్యదైవమైన చౌడేశ్వరీ అమ్మవారి పంచమజ్యోతుల మహోత్సవానికి భక్తులు తరలి రావాలని ఆలయ ధర్మకర్త డీసీ ఈశ్వరయ్య కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతియేటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. జ్యోతులు మోసే కార్యక్రమం రాత్రి ప్రారంభం అవుతుందన్నారు.

నేడు జ్యోతుల ఉత్సవం

హిందూపురం అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలోని చౌడేశ్వరీమాత ఆలయంలో సోమవారం అర్ధరాత్రి నుంచి జ్యోతుల ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ, ప్రధాన అర్చకుడు నాగరాజులు పేర్కొన్నారు. ఆదివారం అమ్మవారి మూల విరాట్‌కు వివిధ అభిషేకాచర్చనలు నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి జ్యోతులు మోస్తారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

నూతన కల్యాణ మండపంలోనే నవమి వేడుకలు



కల్యాణ మండపం పైకప్పు వేస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని యుగపురుషులు సీతారాముల కల్యాణం నూతన కల్యాణమండపంలోనే నిర్వహిస్తామని రమేష్‌రెడ్డి తెలిపాడు. ఆదివారం నూతన తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం రోజు ఆలయంలోని కల్యాణమండపం పైకప్పు ఏర్పాటు పనులను ఆయన పర్యవేక్షించారు. 11వ వార్డు కౌన్సిలర్ అంజలి, శంకర్‌స్వామి, ఆలయ ప్రధాన అర్చకుడు మహేష్, ప్రభాకర్, ఆచారి, హనుమంతు, వెంకటేష్, డాలేశ్వర్, శ్రీనివాసులు, జగప్ప, శివప్ప, చలమయ్య, రమేష్, రాము, రామంజనేయులు, మల్లికార్జున పాల్గొన్నారు.

అటవీ అధికారులకు జింకపిల్ల అప్పగింత

అగళి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం గ్రామంలో ఓ బావిలో జింకపిల్ల పడింది. విషయాన్ని గమనించిన గ్రామస్థులు బావిలో దిగి జింక పిల్లను రక్షించారు. అనంతరం అటవీ అధికారులకు అప్పగించారు. అధికారులు జింక పిల్లను తీసుకుని వైద్య పరీక్షలు చేయించారు.

ఆనందోత్సాహాల నడుమ ఉగాది వేడుకలు

పెనుకొండ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ ఉగాది పండుగ వేడుకలను ప్రజలె ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఆదివారం పండగ సందర్భంగా ప్రతి కుటుంబంలోని సభ్యులు కొత్తబట్టలు ధరించి ఇంటి ముందు ముగ్గులు వేసి, గుమ్మాలను మామిడి తోరణాలతో అలంకరించారు. అనంతరం షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య స్నేహభావం కొనసాగుతుంది

విశ్వావసు నామసంవత్సరంలో రాజు రవి, మంత్రి చంద్రుడు వీరిద్దరు స్నేహితులు కావడంవల్ల కేంద్ర రాష్ట్రాల మధ్య స్నేహభావం కొనసాగుతుంది. ఈ ఏడాది రెండు చంద్రగ్రహణాలు సంభవిస్తాయి. త్రి గ్రహ, చాతుర్గ్రహాలు, పంచగ్రహ కూటములు ఏర్పడతాయి. దీనికారణంగా కొన్ని ప్రాంతాల్లో అతివృష్టి, అనావృష్టి సంభవిస్తాయి. సరిహద్దు ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొనే అవకాశం ఉంది. పరమేశ్వరుని అనుగ్రహంతో ప్రజలందరూ సుఖ శాంతులతో జీవించాలని ప్రార్థిస్తున్నాం.



పెనుకొండలో పంచాంగ పఠనం చేస్తున్న నాగప్రసాద్ శర్మ

పావగడ: తాలూకా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆదివారం వైభవంగా ఉగాది పండుగను జరుపుకున్నారు. చిన్న పిల్లలు మహిళలు నూతన వస్త్రాలు ధరించి ఉగాది పచ్చడిని ఆరగించి హర్షం వ్యక్తం చేశారు. తీపి చేదు రెండింటికి కష్టం సుఖాన్ని సమానంగా పంచుకుని ఏడాదంతా సుఖంగా గడపాలని ఆలయాల్లో పూజలు చేశారు.

మడకశిర రూరల్: ఉగాది పండును ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం ఉదయమే గుమ్మానికి మామిడి ఆకులతో తోరణాలు కట్టారు. అనంతరం పూజకార్యక్రమాలు నిర్వహించారు మండలంలోని నీలకంఠాపురం దేవాలయంలో ఉగాది పండును పురస్కరించుకుని ఆలయ అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల వ్యాప్తంగా ఉగాది పండుగను ప్రజలు ఆదివారం



నీలకంఠాపురం ఆలయంలో పంచాంగ శ్రవణం



గుమ్మయ్యగారిపల్లిలో మారెమ్మను ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా జరుపుకున్నారు. గోరంట్లలోని కొలిమి చింతమాను వద్ద చెక్క భజన ఇతర వినోద కార్యక్రమాలు నిర్వహించారు. గుమ్మయ గారి పల్లి మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఉరేగించారు.



అలంకరణలో చంద్రమౌళేశ్వరస్వామి

మడకశిరటౌన్: పట్టణంలో శోభాయమానంగా ఉగాది పండుగను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. చంద్రమౌళేశ్వరస్వామి ఆలయం, మిట్టబండ ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి, కోట వెంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయాలతో పాటు భోగరామలింగేశ్వరస్వామి, అయ్యప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీడీపీ కార్యాలయంలో...

పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోట వెంకటేశ్వరస్వామి ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఉగాది వేడుకలను నాయకులు, కార్యకర్తలు కలిసి జరుపుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



అలంకరణలో గుడిబండ తుమ్మల మారెమ్మ అమ్మవారు

గుడిబండ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ప్రజలు ఉగాది పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఉగాది పండుగ సందర్భంగా దేవాలయాలు, ఇళ్ల ద్వారాలకు మామిడి ఆకుల తోరణాలు, వేప ఆకులను ఇళ్లు, దుకాణాలకు కట్టి ఉగాది పండుగను జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రొళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ప్రజలు ఉగాది పండుగను ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకొన్నారు. మండలంలోని వెంకటేశ్వరస్వామి, రంగనాథస్వామి, బసవేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

జగనన్న కాలనీలో సమస్యల తిష్ట..!

- నిర్మాణానికి ముందుకురాని లబ్ధిదారులు
- పిచ్చిమొక్కలతో నిండిన పరిసరాలు

సోమందేపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో పేదలను గుర్తించి మండల వ్యాప్తంగా గృహాలను మంజూరు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు కొనుగోలుచేసి కాలనీలను నిర్మించారు. కేంద్రప్రభుత్వ సహకారం, రాష్ట్ర ప్రభుత్వం వాటాతో ఒక్కో గృహానికి రూ.1.80లక్షలు రుణాన్ని మంజూరుచేసి నిర్మాణాలను ప్రజలచేత చేపట్టారు. చాలా చోట్ల పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో అప్పటి ప్రభుత్వం విఫలం కావడంతో సమస్యలు తిష్టవేశాయి. ప్రస్తుత ప్రభుత్వం కొలువుదీరి తొమ్మిది నెలలు కావస్తున్నా జగనన్న లేఅవుట్‌లు వైఎస్ఆర్ కాలనీలుగా ఏర్పాటైన వాటికి ఎన్టీఆర్ నగర్‌లుగా పేరుమార్చి ఇటీవల జీఓలు జారీ చేశారు. దీంతో కాలనీల రూపురేఖలు మారుతాయని ప్రజలు సంబరపడ్డారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పట్టణాలు, పల్లెల్లో పల్లె పండుగ పేరుతో చిన్న చిన్న డ్రైనేజీలు, కల్వర్టులు, మినీ గోకులాలు నిర్మించారు. సోమందేపల్లి మండలంలో రూ.5.50కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కల్పిస్తూ ఇటీవల మంత్రి సవిత ఆధ్వర్యంలో మళ్లీ అట్టహాసంగా ప్రారంభించారు. అయితే ఎన్టీఆర్ నగర్‌లను విస్మరించారు. సోమందేపల్లి మండలంలో నల్లగొండ్రాయనపల్లి 70, చాకర్లపల్లి 693, బుసయ్యగారిపల్లి21, మాగేచెరువు 44, పందిపర్తి 42, కేతగానిచెరువు 42, చాలకూరులో66, మొత్తం 1045మందికి పట్టాలు మంజూరు చేశారు. వీటిలో 836 వివిధ దశల్లో నిర్మాణాలున్నాయి. 334గృహాలు పూర్తయ్యాయి. మిగిలినవి పునాది దశలోనే నిలిచిపోయాయి. వీటికి సంబంధించి క్యాష్ పేమెంట్, మెటీరియల్ కింద రూ.8.67 కోట్లు మంజూరు చేశారు. మిగిలిపోయిన గృహాలను ఎలాగైనా పూర్తిచేయించాలన్న లక్ష్యంతో 'మన ఇల్లు మనగౌరవం' కింద లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికితోడు ఇల్లును పూర్తి చేయించేందుకు అదనపు చెల్లింపులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, ఆదివాసిలకు రూ.లక్ష ఇచ్చేందుకు నిర్ణయించి సంబంధిత నగదును విడుదల చేసింది. దీనిని నాలుగు విడతల్లో లబ్దిదారులకు అందజేయనున్నట్లు గృహనిర్మాణ శాఖ పేర్కొంది. కాలనీలో కనీస సౌకర్యాలను కల్పించినా వాటి నిర్వహణ లోపం, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో లబ్దిదారులు గృహాలు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదన్న విమర్శలు



ఆగిన గృహనిర్మాణాలు



గుబురు చెట్ల మధ్య రహదారి

న్నాయి. కొన్నిచోట్ల పైప్‌లైన్, సిస్టన్‌లు, నీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. అయితే వారానికోసారి నాలుగు రోజులకోసారి నీటిని వదులుతున్నారు. చాకర్లపల్లిలో సమస్య అధికంగా ఉంది. మట్టిరోడ్లలో రాకపోకలు కొనసాగించడం ఇబ్బందికరంగా మారిందని లబ్దిదారులు పేర్కొంటున్నారు. పరిసరాలు పిచ్చిమొక్కలతో పెరిగి గడ్డి పేరుకుపోయిందన్నారు. విషపురుగుల సంచారం అధికం కావడంతో బిక్కు బిక్కుమని సంచరిస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ నగర్‌లో పూర్తిస్థాయిలో ప్రభుత్వం సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసేలా కృషి
- రామాంజనేయులు, గృహనిర్మాణశాఖ ఏఈ

వివిధ దశల్లో ఆగిపోయిన గృహాలను పూర్తిస్థాయిలోట నిర్మించుకునేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. బేస్‌మెంట్‌లెవెల్‌లో ఉండి నిర్మాణాలు చేపట్టనివారికి నోటీసులు జారీ చేస్తున్నాం. నిర్మాణాలు నిర్దేశిత గడువులోగా పూర్తీచేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

నీటి సమస్య పరిష్కరిస్తాం
- మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

ఎన్టీఆర్ నగర్‌లలో బోర్లు, పైప్‌లైన్ ఏర్పాటు చేశాం. వేసవి కావడంతో చాకర్లపల్లి కాలనీలో నీటిసమస్య ఉంది. వారంలోగా దానిని పరిష్కరిస్తాం. మిగిలిన ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

నీటి సమస్య అధికంగా ఉంది



నాలుగు రోజులకోసారి గంటపాటు నీరు వస్తున్నాయి. అది రోజువారి అవసరాలకు సరిపోవడం లేదు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలి. -శారదమ్మ, చాకర్లపల్లి

సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలి



కాలనీ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పిచ్చి మొక్కలు చాలా ఉన్నాయి. విషపరుగుల తాకిడి అధికంగా ఉంది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి. -దాసరి చంద్ర, చాకర్లపల్లి

రహదారులు గుంతలమయం..!

- భారీ వాహనాలతో తరచూ ట్రాఫిక్ జామ్
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

మడకశిరటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ సమస్యతోపాటు రహదారులు గుంతల మయంగా మారుతున్నాయి. నియోజకవర్గ కేంద్రంలో కర్ణాటక ఇటు ఆంధ్ర ప్రాంతాల నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సిమెంట్, ఇనుముతోపాటు ఇతరత్రా ముడి సరుకులకు సంబంధించిన భారీ వాహనాలు ఇటు కర్ణాటకకు పోవాలన్నా, ఇటు హిందూపురం, అనంతపురం వెళ్లాలన్నా మడకశిర మీదుగా వెళ్లాల్సి ఉంది. పట్టణంలో నిత్యం వాహనాలు సంచరిస్తుండటంతో రహదారులు దెబ్బతింటున్నాయి. ట్రాఫిక్ సమస్యతోపాటు రహదారులు దెబ్బతింటుండటంతో గత తెలుగుదేశం ప్రభుత్వంలో నేషనల్ హైవే కనెక్ట్‌చేస్తూ రింగ్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కడ పనులు అక్కడ ఆగిపోయాయి. అప్పటి ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మరోసారి ఎన్‌డీఏ ప్రభుత్వంపై పట్టణ వాసులు ఆశలు పెట్టుకొన్నారు. రింగ్‌రోడ్డు నిర్మాణం పూర్తయితే పావగడ నుంచి తుమకూరు, బెంగళూరు, శిరాతోపాటు తాడిపత్రి, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి సిమెంటు, ఐరన్ లోడ్‌తో భారీ వాహనాలు మడకశిర మీదుగా కర్ణాటక ప్రాంతానికి తరలిపోవాల్సి ఉంది. ఇటు హిందూపురం, పెనుకొండ ప్రాంతాలకు సైతం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యతోపాటు రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా భారీ వాహనాల రాకపోకలు పట్టణం నుంచికాక నేషనల్ హైవేతోపాటు రింగ్‌రోడ్డు నిర్మాణం పూర్తయితే సమస్య పరిష్కారమవుతుందని పట్టణ వాసులు అంటున్నారు.



పట్టణంలో గుంతలమయంగా మారిన రహదారి

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- కల్లుమర్రి పీహెచ్‌సీ వైద్యాధికారి వినోద్ కుమార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మడకశిర రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎండలు అధికంగా ఉన్నాయి. వడదెబ్బలు తగలకుండా జాగ్రత్తలు పాటించాలని కల్లుమర్రి పీహెచ్‌సీ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. ఆయన శుక్రవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న : వడదెబ్బ తగలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: ఎండలు అధికంగా ఉనాయిఇ. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పని చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి నుంచి బయటికి వెళ్లే ముందు నీరు ఎక్కువగా తాగాలి. ఎండలో తిరిగే సమయంలో చల్లని నిమ్మరసం, కొబ్బరి నీరు, నీరు తాగాలి. తలకు టోపీ, గొడుగు వాడాలి.

ప్రశ్న : వడదెబ్బ తగిలిన వ్యకికి ఎలాంటి ప్రథమ చికిత్స అందిస్తారు?

జవాబు: వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి చేర్చాలి. చల్లిని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు అలాగే చేస్తుండాలి. ఉప్పుకలిపిన మజ్జిగ లేదా గ్లూకోజు ద్రావణం,లేదా ఓఆర్ఎస్ తాగించాలి.

ప్రశ్న : సీజనల్ వ్యాధుల పట్ల ఎలాంటి చర్యలు తీసుకోంటున్నారు?

జవాబు : వేసవిలో సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. రైతు కూలీలు, రైతులు ఎండలో ఎక్కువగా తిరగడంతో వారికి జ్వరాలు,కళ్లతిరిగి పడిపోవడం వంటివి జరుగుతున్నాయి. అలాంటి వారు పీహెచ్‌సీకి అధికంగా వస్తున్నారు.

ప్రశ్న: గ్రామీణ ప్రజలకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారు?

డాక్టర్ : ఆరోగ్య కార్యకర్తలు గ్రామాలకు వెళ్లి ప్రజలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెటర్లతో మాట్లాడుతున్న జడ్పీటీసీ ఉమేష్

అగళి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని టీడీపీ జడ్పీటీసీ ఉమేష్ పేర్కొన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఓటమి అంగీకరించినప్పుడే గెలుపునకు నాంది పలుకుతుందన్నారు. అనంతరం క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

పావగడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం వలసబాట పట్టి ఉగాది పర్వదినానికి స్వగ్రామానికి వస్తుండగా కొరటగెరె సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో శివమ్మ(34), రమేష్(40)అనే దంపతులు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు సిద్దాపురం గ్రామానికి చెందిన రమేష్, శివమ్మ బెంగళూరులోని ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఉగాది పండగ కోసం శనివారం రాత్రి ద్విచక్రవాహనంలో పావగడకు వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారన్నారు. దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పండుగ రోజున దంపతులిద్దరు మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కాలువలో పడి స్వీపర్..

పెనుకొండ రూరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దర్గా సర్కిల్ పూలమండీ సమీపంలో కాలువలోపడి రాముడు(49) మునిపల్ స్వీపర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెనుకొండ నగర పంచాయితీలో రాముడు మునిసిపల్ స్వీపర్‌గా పని చేస్తున్నాడు. రాముడు కుటుంబ కలహాల నేపథ్యంలో రెండు రోజుల నుంచి ఇంటికి వెళ్ళలేదు. ఆదివారం మద్య సేవించి దర్గా సమీపంలోని మురికి కాలవులో మూత్రవిసర్జనకు వెళ్ళి అదుపు తప్పి కాలువలో పడి మృతి చెంది చెందాడని పోలీసుల సమాచారం. మృతదేహంను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య రామాంజినమ్మ ఉన్నారు.

దొంగను బంధించిన రైతులు

చిలమత్తూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పొలానికి రక్షణగా వేసిన ఇనుప కంచెను కొందరు వ్యక్తులు చోరీ చేస్తుండగా పొలం యజమానులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మండలంలోని కనిశెట్టిపల్లికి చెందిన గణేష్, నవీన్ కుమార్ తన పొలంలో బోరుబావి తవ్వి వ్యవసాయానికి సిద్ధం చేసుకుంటున్నాడు. పొలంలో రాతి కుసాలు నాటి ఇనుప డైమండ్ మెష్‌ను కంచెగా ఏర్పాటుచేసుకున్నాడు. ఇది గుర్తించిన కొందరు వ్యక్తులు శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తరువాత ఇనుప కంచెను వంద అడుగుల వరకు కత్తిరించారు. ఈ సమయంలో యజమాని గణేష్ నవీన్ కుమార్ అక్కడికి రావడంతో దుండగులు పరుగులు పెట్టారు. వారిలో ఒక వ్యక్తి కొంత దూరం వెళ్లి దాచుకోవడానికి ప్రయత్నించగా పట్టుబడ్డాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. జరిగిన చోరీని పోలీసులకు వివరించి పట్టుబడిన వ్యక్తిని పోలీసులకు అప్పగించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

గోరంట్ల మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గోరంట్ల మండలం ఎర్రబల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన ద్విచక్రవాహనం ప్రమాదంలో కార్తీక్, కేశవరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. పులివెందలకు చెందిన కేశవరెడ్డి, కార్తీక్ ముదిగుబ్బ-కోడూరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో సివిల్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. ద్విచక్రవాహనంలో వస్తుండగా ఎర్రబల్లి గ్రామం మలుపు వద్ద ద్విచక్రవాహనం బోల్తా పడటంతో కార్తీక్ తీవ్రంగా గాయపడగా కేశవరెడ్డికి స్వల్ప గాయాలయ్యాలయి. 108లో గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం హిందూపురానికి తరలించారు.

లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

పెనుకొండ రూరల్: మండలంలోని కియ పరిశ్రమ మెయిన్‌గేఏటు వద్ద ఆదివారం రాత్రి లారీ ఢీకొన్న ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కియ పోలీసులు తెలిపిన మేరకు పరిశ్రమ ప్రాంతంలో పనిచేసే ఒక వ్యక్తి సూరె మెయిన్‌గేటువద్ద జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళుతుండగా అనంతపురం నుంచి పెనుకొండ వైపు వెళుతున్న లారీ ఢీకింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు వెంటనే స్పందించి అతనిని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. కియ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.